
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
శనివారం 6 డిసెంబరు 2025



అభివృద్ధి సూచికల్లో మెరుగుపడాలి

- కూరగాయల పెంపకంపై దృష్టి పెట్టాలి
- కలెక్టర్ రామసుందర్ రెడ్డి

7లో



- విద్యాభివృద్ధే ప్రభుత్వ అజెండా
- విద్యార్థులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతాం
- పిల్లలు మట్టిలో మాణిక్యాలు.. ప్రోత్సహిస్తే ఏదైనా సాధిస్తారు
- ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహణ
- విద్యా రంగాన్ని వైసీపీ భ్రష్టుపట్టించింది
- సీఎం చంద్రబాబునాయుడు
- భామినిలో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం విజయవంతం



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, చిత్రంలో మంత్రి లోకేశ్

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు



పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు

పార్వతీపురం/సీతంపేట రూరల్/భామిని, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): 'విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తాం.. విద్యాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం.' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. శుక్రవారం భామిని ఏపీ మోడల్ స్కూల్‌లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని (పీటీఎం) నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ముందుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో సీఎం, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ.. 'ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పిల్లలు పాఠశాలకు హాజరవుతున్నారా? లేదా? అనే విషయాన్ని లీప్‌యాప్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.' అని తెలిపారు. కొన్ని రోజులుగా పాఠశాలకు రాకపోవడంపై ఓ విద్యార్థినిని సీఎం ప్రశ్నించి కారణాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల విద్యా (మిగతా 8వ పేజీలో..)

విద్యా వ్యవస్థలో సంస్కరణలు: మంత్రి లోకేశ్

'విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకుకొస్తున్నాం. వ్యవస్థను బలోపేతం చేయడానికి అందరూ సహకరించాలి. రాష్ట్రంలో ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందాలనేదే మా లక్ష్యం. చిన్నప్పుడు పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ అంటే ఎంతో భయమేసేది. ఈరోజు పిల్లలు నిర్వహించిన మాక్ అసెంబ్లీ సమావేశాలు చూస్తే నాకెంతో ఆనందాన్నిచ్చింది. విద్యా విలువలను పెంపొందించేందుకు చాగంటి కోటేశ్వరరావుతో పిల్లలకు ప్రవచనాలు, సూక్తులు అందిస్తున్నాం. తల్లికి చెప్పలేని పనిని ఎప్పుడు చేయకూడదు. విద్యార్థులకు అర్థమయ్యేలా బాలల రాజ్యాంగాన్ని రూపొందించాం. క్లిక్కర్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చి పైలెట్ ప్రాజెక్ట్‌గా భామిని మోడల్ స్కూల్‌లో అమలుచేస్తున్నాం. లీప్ యాప్ అందుబాటులోకి తీసుకొచ్చాం. దీని ద్వారా పిల్లల విద్యా ప్రమాణాల స్థాయిని తల్లిదండ్రులు తెలుసుకోవచ్చు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నా వెన్నంటే ఉండి విద్యారంగంలో తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు అందిస్తున్నారు. దీనిపై ప్రతి అంశాన్ని చర్చించుకుంటున్నాం.' అని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అంతకముందు ప్రముఖ సాహితీవేత్త కారా మాస్టారు గురించి వివరించారు. ఓ తల్లి కష్టంతో విద్యనభ్యసించిన వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారని టంగుటూరి ప్రకాశం పంతులు గురించి విద్యార్థులకు వివరించారు.



మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

మహిళాభివృద్ధికి అడుగులు

- శతశాతం ప్రగతి సాధనకు యత్నాలు
- ఎనిమిది అంశాలపై మహిళా సంఘాలకు శిక్షణ
- తొమ్మిది మండలాల్లో తొలివిడత పూర్తి

శృంగవరపుకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధికి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. శతశాతం ప్రగతి సాధనకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ మేరకు ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సామాజిక భద్రత, ఆస్తుల సృష్టి, ప్రవర్తనలో మార్పు, సుస్థిర జీవనోపాధులు, సామర్థ్యాల పెంపు వంటి ఎనిమిది అంశాలపైన దృష్టిసారించింది. వీటిని అధిగమించేందుకు ఉన్న అవకాశాలు, బడ్జెట్‌ను సమకూర్చుకునేందుకు మండలాల వారీగా స్త్రీ శక్తి (వెలుగు) కార్యాలయాల్లో మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇస్తుంది. తొలివిడతగా జిల్లాలో శృంగవరపుకోట, లక్కవరపుకోట, బొబ్బిలి, విజయనగరం, నెల్లిమర్ల, బొండపల్లి, చీపురుపల్లి, గరివిడి, సంతకవిటి మండలాల్లో స్వయం సహాయక సంఘాలకు ఏపీఎంలు మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. శుక్రవారం ఈ శిక్షణ ముగిసింది. మిగతా మండలాల్లో త్వరలో రెండో విడత శిక్షణ ప్రారంభంకానుంది.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో 27 మండలాల్లో 40,439 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిల్లో 4,39,678 మంది మహిళా సభ్యులు నమోదై ఉన్నారు.



ఎస్.కోట స్త్రీశక్తి (వెలుగు) భవనంలో శిక్షణకు హాజరైన స్వయం సహాయక సంఘ సభ్యులు

వీరి ద్వారా గ్రామాల్లో ఆర్థిక ప్రగతిని సాధించేందుకు ప్రభుత్వం ప్రణాళికను తయారు చేసింది. గ్రామాల్లో ఇప్పటికీ మరుగుదొడ్లు లేని నివాసాలు ఉన్నాయి. శానిటరీ ప్యాడ్స్ అంటే తెలియని వారున్నారు. ఇవన్నీ ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. అత్యధికంగా మహిళలు అనారోగ్యం పాలవుతున్నారు. మహిళలు ఆరోగ్యంగా (మిగతా 8వ పేజీలో..)

ఎలా ఉన్నారో?.. ఏం చేస్తున్నారో?

- బంగ్లాదేశ్ జైలులో తొమ్మిదిమంది జిల్లా మత్స్యకారులు
- వారిని స్వగ్రామాలకు తీసుకొచ్చేదెప్పుడు?
- ఆరు వారాలవుతున్నా స్పందనలేదని కుటుంబ సభ్యుల ఆవేదన
- వారి బాగోగులపై ఆందోళన



బంగ్లాదేశ్ కోస్ట్‌గార్డ్స్ అదుపులో ఉన్న మత్స్యకారులు(ఫైల్)

భోగాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన తొమ్మిది మంది మత్స్యకారులు బంగ్లాదేశ్ కోస్టుగార్డ్స్‌కు చిక్కి ఆరు వారాలు అవుతుంది. అక్కడి జైలులో వారు మగ్గుతున్నారు. అయితే, వారి యోగ క్షేమాలపై కుటుంబ సభ్యుల్లో బెంగ నెలకొంది. తమ వారు ఎలా ఉన్నారో?.. ఏం చేస్తున్నారో అని ఆందోళన చెందుతున్నారు. వారి రాక కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. భోగాపురం మండలం కొండ్రాజుపాలెంకు చెందిన మరుపల్లి చిన్నఅప్పన్న, మరుపల్లి రమేష్, సూరాడ అప్పలకొండ, మరుపల్లి ప్రవీణ్, సురపతి రాము, అప్పలకొండ, పూసపాటిరేగ మండలం తిప్పలవలసకు చెందిన నక్కా రమణ, వాసపల్లి సీతయ్య, మైలపల్లి అప్పన్న విశాఖపట్నంలోని జాలరుపేటలో నివాసముంటున్నారు. ఈ తొమ్మిది మంది మత్స్యకారులు ఈ ఏడాది అక్టోబరు 13న ఐఎన్‌డీ-ఏపీ- వీ5- ఎంఎం-735 నెంబరు గల పడవపై విశాఖ హార్బర్ నుంచి చేపల వేట నిమిత్తం సముద్రంలోకి వెళ్లారు. వేట సాగిస్తూ సిగ్నల్స్ అందక, వాతావరణం అనుకూలించక తదితర కారణాలతో అదే నెల 22వ తేదీ వేకువ జామున సుమారు 2గంటల సమయంలో సరిహద్దులు దాటి బంగ్లాదేశ్ జలాల్లోకి వెళ్లిపోయారు. దీంతో వారిని ఆ దేశ కోస్టుగార్డ్స్ అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అప్పట్లో పలువురు నాయకులు, అధికారులు బాధిత కుటుంబ (మిగతా 8వ పేజీలో..)

బాలికపై అత్యాచారయత్నం

- యువకుడిపై పోక్సో కేసు నమోదు

నెల్లిమర్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ఓ కాలనీకి చెందిన బాలిక(17)పై అయ్యన్నపేటకు చెందిన మజ్జి కృష్ణవర్ధన్(21) అనే యువకుడు అత్యాచారయత్నం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. ఈ నెల 2వ తేదీ రాత్రి కృష్ణవర్ధన్.. బాలికకు మాయమాటలు చెప్పి ఆమెను నెల్లిమర్ల శివారు సారిపల్లి టిడ్కో కాలనీకి తీసుకువచ్చాడు. అక్కడ సీ-2 బ్లాక్‌లోని ఓ ఇంటిలో బాలికపై అత్యాచారయత్నం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపడుతున్నారు. ఆ బ్లాక్‌లోని ఇళ్లన్నీ ఖాళీగా ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు. అయితే, నిందితుడు సరాసరి బాలికను ఆ ఖాళీ ఇంటికి తీసుకువచ్చాడా?, లేదంటే ఆ ఇంటి యజమాని నిందితునికి సహకరించాడా? అన్న విషయం పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడు. ఇతనిపై వివిధ ఘటనలకు సంబంధించి ఆరు కేసులు నమోదై ఉన్నాయి. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్టు ఎస్ఐ గణేష్ తెలిపారు.

అలరించిన సంగీత స్వరాభిషేకం

- డ్రమ్స్‌తో అదరగొట్టిన శివమణి

విజయనగరం కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) ఘంటసాల జయంతి సందర్భంగా స్థానిక ఆనందగజపతి కళాక్షేత్రంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఘంటసాల నిర్విరామ సంగీత స్వరాభిషేకం అలరించింది. ముఖ్య అతిథిగా పెర్కషన్ మాస్ట్రో, పద్మశ్రీ శివమణి హాజరయ్యారు. తన డ్రమ్స్‌తో అదరగొట్టి అందరినీ ఆనందంలో ముంచెత్తారు. ఉదయం నుంచి రాత్రి వరకూ పలువురు గాయనీ, గాయకులు.. ఘంటసాల పాటలతో అందరినీ మైమరిపించారు. ఈ సందర్భంగా శివమణి మాట్లాడుతూ.. ఘంటసాల జయంతి ఉత్సవంలో పాల్గొనడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు.



ఘంటసాల గీతాలను ఆలపిస్తున్న గాయకులు



శివమణిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తదితరులు

ఇందుకు స్మారక కళాపీఠానికి అభినందనలు తెలిపారు. తన తండ్రి డ్రమ్ము వాయించే వారని, ఆయన ద్వారా తాను డ్రమ్స్ వాయిస్తూ ఈ స్థాయిలో ఉన్నట్టు చెప్పారు. తనకు బాలసుబ్రహ్మణ్యం గాడ్ ఫాదర్ అని పేర్కొన్నారు. పిల్లలు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, పుస్తకాలతో తమ ప్రతిభ పాటవాలు ప్రదర్శించాలని అన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ.. ఘంటసాల స్మారక కళాపీఠం ఇటువంటి బృహత్తర (మిగతా 8వ పేజీలో..)

దివ్యాంగుల్లోనే ఎంతో ప్రతిభ

- హోంశాఖ మంత్రి అనిత



మాట్లాడుతున్న మంత్రి అనిత

కొత్తవలస, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అన్ని అవయవాలు ఉన్న వారికంటే, అవయవ లోపం ఉన్నవారిలోనే ఎంతో ప్రతిభ ఉంటుందని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టును ఆమె శుక్రవారం సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. శరీరంలో ఏదో ఒక అవయవం లేనివారు దివ్యాంగులు కాదని, అన్ని అవయవాలు సక్రమంగా ఉండి కనీసం మానవత్వం లేకుండా ఎదుటివారిపై కుట్రలు, కుతంత్రాలు, దుర్బుద్ధి కలినిగిన వారే నిజమైన మానసిక వికలాంగులని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. బీసీ, ఎస్సీ ఎస్టీలతో పాటు దివ్యాంగులకు కూడా నామినేటెడ్ పదవులను ఇస్తున్నారని అన్నారు. దివ్యాంగులను మూడు కేటగిరీలుగా విభజించి వారికి రూ.6 వేలు, రూ.10 వేలు రూ.15 వేలు చొప్పున ప్రతి నెలా ఒకటో తేదీన వారి ఇంటికి తీసుకెళ్లి పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. గురుదేవ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎన్టీఆర్ వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. రూ.12 కోట్లతో ఉప్పలపాటి విజయశ్రీ పేరుతో 100 పడకల క్యాన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చేశామ న్నారు. ఈ సందర్భంగా (మిగతా 8వ పేజీలో..)

విలువలతో కూడిన విద్యను అందించాలి

- పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరావు

గజపతినగరం, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత భవిష్యత్ లభిస్తుందన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేదిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మంత్రి నారా లోకేశ్ విద్యా వ్యవస్థకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఆలోచన శక్తి దేశానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇంటివద్ద తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల ప్రత్యేక బాధ్యత తీసుకోవాలన్నారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. పదో తరగతిలో ఈఏడాది శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా 2027 జనవరి నాటికి అదనపు తరగ తుల గదులు నిర్మిస్తామని తెలిపారు. హై స్కూల్‌కు 12, జూనియర్ (మిగతా 8వ పేజీలో..)

ఆత్మీయ సమావేశాలు

- జిల్లా వ్యాప్తంగా మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లు

6లో

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి

7లో

ఆక్రమణల తొలగింపునకు సిద్ధం

తెల్లారితే పెళ్లి.. అంతలోనే.. యువకుడి ఆత్మహత్య

- చిన్నప్పటి నుంచి స్నేహితులు.. ప్రేమికులు
- మూఢం తరువాత పెళ్లి చేద్దామన్న పెద్దలు
- కుదరదు.. వెంటనే చేయాలన్న ప్రియురాలు
- సింహాచలం వెళ్లి దండలు మార్చుకోవాలని నిర్ణయం
- ఇంతలోనే ప్రియుడి బలవన్మరణం

విజయనగరం క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ చిన్నప్పటి నుంచి స్నేహితులు. ఒక్కటే సామాజిక వర్గం. ఇద్దరూ కలిసి చదువుకున్నారు. వారి స్నేహం ప్రేమగా మారింది. దీన్ని పెళ్లిపీటల వరకూ తీసుకువెళ్లాలనుకున్నారు. విషయాన్ని ఇరు కుటుంబాల పెద్దలకు చెప్పడంతో వారు కూడా అంగీకరించారు. ప్రస్తుతం మూఢమని, అది పూర్తయిన వెంటనే వచ్చే ఏడాది ఫిబ్రవరి 22 తరువాత పెళ్లి (మిగతా 8వ పేజీలో..)



వీరేంద్ర (ఫైల్)

10 నుంచి టెట్

- జిల్లాలో ఐదు కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 13,985 మంది అభ్యర్థులు



విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభంకానుంది. జిల్లాలో ఐదు కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించనున్నారు. సీతం ఇంజనీరింగ్ కాలేజీ, ఐయాన్ డిజిటల్ జోన్, ఎంవీజీఆర్, లెండి, అవంతి ఇంజనీరింగ్ కాలేజీల్లో పరీక్ష కేంద్రాలను కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా 13,985 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఈనెల 10 నుంచి 21 వరకు ప్రతి రోజూ రెండు సెషన్లలో పరీక్ష జరగనుంది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరగనుంది. అభ్యర్థులు హాల్ టిక్కెట్‌తో పాటు ఒరిజినల్ గుర్తింపు కార్డు (ఆధార్, పాన్, ఓటర్) తప్పకుండా తీసుకుని వెళ్లాలి. ఆన్‌లైన్‌లో జరిగే ఈ పరీక్షకు (మిగతా 8వ పేజీలో..)

ఉత్సాహంగా..

పేరెంట్స్, టీచర్స్ సమావేశం విజయవంతం



భామినిలో హెలీప్యాడ్ వద్ద సీఎం చంద్రబాబు ఫొటోలు తీస్తున్న జనం



భామిని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులతో మంత్రి లోకేశ్



విద్యార్థి కేదారసాయిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్



పాఠ్యాంశాలపై వివరిస్తున్న ఉపాధ్యాయుడు



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం

సీతంపేట రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): భామిని మోడల్‌స్కూల్ ప్రాంగణంలో శుక్రవారం పేరెంట్స్, టీచర్స్ సమావేశం ఉత్సాహంగా సాగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ఉదయం 10.30గంటలకు సీఎం మోడల్ స్కూల్ ప్రాంగణానికి చేరుకున్నారు. ముందుగా తల్లిదండ్రులు, విద్యార్థులతో భేటీ అయ్యారు. అనంతరం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో సీఎం 50నిమిషాల పాటు ప్రసగించారు. ఈ సభకు పిల్లలు అధ్యక్షత వహించడం గమనార్హం. సీఎం తర్వాత లోకేష్ ప్రసగించారు. పిల్లల ప్రతిభాపాటవాలను ఇద్దరూ మెచ్చుకున్నారు. తర్వాత విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు కార్యక్రమం కొనసాగింది. తర్వాత సీఎంతో పాటు మంత్రి లోకేష్ సభాస్థలి నుంచి బయలుదేరి హెలికాప్టర్‌లో తిరిగిపయనమయ్యారు. చంద్రబాబుతో పాటు లోకేష్‌ను చూసేందుకు భారీగా సభా ప్రాంగణానికి తరలివచ్చారు. ప్రాంగణంలోకి అనుమతించకపోవడంతో చంద్రబాబు, లోకేష్ వెళ్లే సమయంలో రహదారిపై జెండాలు పట్టుకుని జై చంద్రబాబు, జై లోకేష్ అంటూ నినాదాలు చేశారు.

కలెక్టర్‌కు సీఎం అభినందనలు..

పార్వతీపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భామినిలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం విజయవంతంగా నిర్వహించారని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. జిల్లా అధికార యంత్రాంగం పనితీరును కూడా ప్రశంసించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషిచేయాలని సీఎం సూచించారు.



హెలీప్యాడ్ వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి లోకేశ్



బైక్‌పై టీడీపీ అభిమాని ఇలా..



చంద్రబాబు, లోకేశ్‌కు ఫొటో తీస్తున్న ఓ విద్యార్థిని



భామిని పాఠశాల వద్ద సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే జయకృష్ణ

(సీతంపేట రూరల్, భామిని)

సీఎం సమావేశంలో సైడ్‌లైట్స్..

- సీఎం చంద్రబాబునాయుడు రాకకోసం మంత్రి లోకేశ్ సుమారు 30నిమిషాలు సభా వేదిక ప్రాంగణంలో నిరీక్షించారు.
- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ మంత్రి నారా లోకేశ్ వద్దకు వచ్చి సమావేశం నిర్వహణపై సమాలోచన చేశారు.
- ఆత్మీయ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గరకు నాలుగుసార్లు మంత్రి లోకేశ్ వెళ్లి మాట్లాడటం కనిపించింది.
- విద్యార్థుల ప్రసంగాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తిగా వింటూ చప్పట్లు కొట్టారు.
- వేదికపై ఉన్న విద్యార్థిని నిహారికకు మంత్రి లోకేశ్ పుస్తకాన్ని చూపి కొన్ని ప్రశ్నలు వేశారు.
- సభా వేదికపై కూర్చున్న విద్యార్థిని తల్లి ఆశాజ్యోతితో మంత్రి లోకేశ్‌తో పాటు ఎమ్మెల్యే జయ కృష్ణ మాట్లాడారు.
- విద్యార్థినుల కరాటే ప్రదర్శనను సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లు ఆసక్తిగా తిలకించి వారితో ఫొటోలు దిగారు.
- పద్యాలు చదివి వినిపించిన విద్యార్థితో సీఎం చంద్రబాబు ముచ్చటించారు.



భామిని హెలీప్యాడ్ వద్ద చంద్రబాబును చూసేందుకు తరలివచ్చిన ప్రజలు

ఆత్మీయ సమావేశాలు

జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ శుక్రవారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లు నిర్వహించారు. తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లల ప్రతిభను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు కూడా హాజరయ్యారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను తల్లిదండ్రులకు వివరించారు. విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు.

- జిల్లా వ్యాప్తంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లు

విలువలతో కూడిన విద్య అవసరం: కలెక్టర్ రామసుందర్ రెడ్డి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

గంట్యాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విలువలతో కూడిన విద్య అవసరమని కలెక్టర్ రామసుందర్ రెడ్డి పిలుపునిచ్చారు .శుక్రవారం గంట్యాడ కేజీబీవీలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల కోసం రూపొందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను పాఠశాలలు సమర్థంగా అమలు చేయాలన్నారు. సి, డి గ్రేడుల్లో ఉన్న విద్యార్థులు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఏ,బీ గ్రేడ్లకు చేరుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధ్యాయుని అవతారం ఎత్తి పాఠ్యాంశాలను బోధించారు. ఈ సమావేశంలో భాగంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలను ఓపికగా సమాధానం ఇచ్చారు. డీఈవో మాణిక్యంనాయుడు, ఐసీడీఎస్ పీడీ విమలరాణి, స్కూల్ మేనేజ్మెంట్ చైర్మన్ గౌరి, కేజీబీవీ ప్రిన్సిపాల్ జ్యోతి విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేయండి: ఎస్పీ దామోదర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను తరచూ గమనిస్తూ వారి భవిష్యత్తుకు పునాదులు వేయాలని ఎస్పీ ఎఆర్ దామోదర్ అన్నారు. నగరంలోని కస్పా ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పేరేంట్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. విద్యార్థుల ఆసక్తిని గమనించి ఆయా రంగాల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సోషల్ మీడియా, రీల్స్ మోజులో పడితే భవిష్యత్ అంధకారమన్నారు. మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి అలవాట్లకు లోనుకావద్దన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎస్పీ దామోదర్ తిలకించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానో పాధ్యాయురాలు విశాలాక్షి, టూటౌన్ సీఐ శ్రీనివాసరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చేతిలోనే విద్యార్థుల భవిష్యత్తు: ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్ విద్యార్దుల తల్లిదండ్రుల్లోనే ఉందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ముందుగా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల కంటే ఉత్తమంగా ప్రభుత్వ పాఠశాలల విద్యాప్రమాణాలు మెరుగుపరిచేవిధంగా సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎంత గానో శ్రమిస్తున్నారని అన్నారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గెడ్డాపు అప్పలనాయుడు, రౌతు వాసు, తహసీల్దార్ ఎం.రాజశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, ఎంఈఓలు పి.ప్రవీణ్‌కుమార్, వై.దుర్గారావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు

ఉన్నతంగా ఎదిగేందుకు కృషి: ఎమ్మెల్యే అదితిగజపతిరాజు



ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు నిరంతరం కృషి చేయాలని ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు అన్నారు. గుంకలాం గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పేరేంట్స్ టీచర్స్ సమావేశానికి ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విలువలతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తల్లిదండ్రులు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సహకరించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులతో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడారు.

మంచి నడవడికను అలవరుచుకోండి..



విద్యార్థులతో భోజనం చేస్తున్న చిరంజీవి, బంగార్రాజు

పూసపాటిరేగ/నెల్లిమర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి నడవడికను అలవరచుకోవాలని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సతివాడ ఆదర్శ పాఠశాలలో జరిగిన పీటీఎంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు, సువ్వాడ రవిశేఖర్, మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్, జనసేన నాయకులు చనమల్లు వెంకటరమణ, టీడీపీ నాయకుడు కోరాడ శ్రీనివాసరావు, బీజేపీ నాయకుడు ఆల్తి నల్లిబాబు, పాఠశాల ప్రిన్సిపాల్ పద్మలత పాల్గొన్నారు. నెల్లిమర్లలోని బాలికోన్నత పాఠశాలలో కార్యక్రమానికి ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

చదువుతోపాటు విజ్ఞత అవసరం: ఎమ్మెల్యే లోకం నాగమాధవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

డెంకాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు విజ్ఞతను పెంచుకోవాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. అక్కివరం వద్ద గల మోడల్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో ఆమె పాల్గొన్నారు. విద్యారంగం అభివృద్ధిలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారం ఎంతో ముఖ్యమని వివరించారు. పాఠశాలల్లో విద్యార్థులు మౌలిక వసతుల తో పాటు డిజిటల్ తరగతి గదుల వంటి సౌకర్యాలను వినియోగించుకోవా లన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని ప్రతిజ్ఞ చేయించారు. జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, ఎంపీపీ వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, మాజీ జెడ్పీటీసీ కంది సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు భాస్కరరావు, నాయకులు పాణిరాజు, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంధ్యపాల్గొన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి..



మాట్లాడుతున్న కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు

గుర్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబం నుంచి ఒక విద్యార్థి ఉద్యోగిగా మారితే ఆ కుటుంబం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని కస్తూరిబా గురుకుల పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్-టీచర్స్ సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. పిల్లలు మొబైల్ వాడకంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. మండల టీడీపీ అధ్యక్షులు చనమల్లు మహేష్‌రావు, మాజీ జెడ్పీటీసీ కిరణ్‌రాజు, ఉత్తరాంధ్ర విద్యార్థిసేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణ మూర్తి, టీడీపీ నాయకులు గొర్లె రామునాయుడు, కిలారి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తు కోసమే సమావేశాలు..

కొత్తవలస, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు కోసమే మెగా తల్లితండ్రుల సమావేశాలు ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శుక్రవారం కొత్తవలస జడ్పీహైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యాబివృద్ధి బాధ్యత కేవలం ఉపాధ్యాయులదే కాదని, తల్లితండ్రులపై కూడా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచే ప్రతిభావంతులు వస్తున్నారనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. హెచ్‌ఎం ఈశ్వరరావు, సీఐ షణ్ముఖరావు, తహసీల్దార్ సునీత, ఎస్ఐ జోగారావు, రాష్ట్ర దాసరి కార్పొరేషన్ చైర్మన్ రత్నాజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు కోళ్ల వెంకటరమణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లలితకుమారి

ఇష్టపడి చదివితే భవిష్యత్ మీదే: ఎమ్మెల్యే విజయచంద్ర



ఆత్మీయ సమావేశంలో విద్యార్థులతో ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం టౌన్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఇష్టపడి చదివితే భవిష్యత్ మీదేనని విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొత్తవలస కేపీఎం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల 3.0 ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కలలను సాకారం చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రానున్న 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం ఇటీవల సారథి ఫౌండేషన్ నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల విజేతలకు రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులను అందజేశారు.

విద్యా ప్రమాణాలే లక్ష్యం: ప్రభుత్వ విప్ జగదీశ్వరి



మాట్లాడుతున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ జగదీశ్వరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో ఏకకాలంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు సందర్శించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ కద్రక కళావతి, మండల పార్టీ అధ్యక్షుడు అడ్డాకుల నరేష్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, జియమ్మవలస మండల కన్వీనర్ జోగి భుజంగరావు, తోటపల్లి దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు ఆరిక జానకి, పాఠశాల చైర్మన్ వైస్ చైర్మన్ చిన్న, రాజేశ్, నాగమణి, మంజువాణి, కార్తికేయ, వెంకటరావు, పీటీజీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్యవతి, కళాశాల ప్రిన్సిపాల్ భారతి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పత్తిని కొనుగోలు కేంద్రాలకు ఇవ్వండి

గజపతినగరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలో పత్తి అమ్మకాలు చేపట్టాలని ఏడీఏ నిర్మలజ్యోతి అన్నారు. శుక్రవారం ఎం. గుమడాం, మరుపల్లి, ఎన్.జి.ఆర్.పురం, తుమ్మికాపల్లి, లింగాలవలస గ్రామాల్లో పర్యటించారు. రైతులు సాగు చేసిన పత్తిని పరిశీలించారు. రైతు సేవా కేంద్రాల ను సంప్రదించి.. సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా దేముడు

గజపతినగరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా దొగ్గ దేముడు నియమితులైనట్టు రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయనను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఏడుకొండలు, నియోజకవర్గ ఇన్‌చార్జి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల నిరసన

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. వీఆర్ఏలందరికీ తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గురుమూర్తి, సూర్య నారాయణ పాల్గొన్నారు.

వాలీబాల్ జట్టు ఎంపిక

డెంకాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గానూ యూనివర్సిటీ వాలీబాల్ పురుషుల జట్టు ఎంపికలను ఎంవీజీఆర్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ (ఎ) శుక్రవారం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ వీసీ విస్సా కోడేటి వెంకట సుబ్బారావు, ఎంవీజీఆర్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్ పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారి మృతి

గజపతినగరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహిస్తున్న నగర సుభద్ర అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్న ఆమె మధుపాడ గ్రామంలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆమె మృతిపట్ల వివిధ శాఖల అధికారులు సంతాపం తెలిపారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

లక్కవరపుకోట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కొత్తవలసకు చెందిన ముస్లింలు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కొత్తవలస కేంద్రంగా సుమారు 250 కుటుంబాల ముస్లింలు నివాసం ఉంటున్నారని.. స్థానికంగా శ్మశాన వాటిక లేదని తెలిపారు. దీని కోసం స్థలం కేటాయించాలని వారు కోరారు.

సీహెచ్‌సీకి నిధులు

భోగాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సుందరపేట సమీపం లోగల సామాజిక ఆరోగ్య కేంద్రం మరమ్మతులకు ప్రభుత్వం రూ.40లక్షలు మంజూరు చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ శుక్రవారం తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని

జాగ్రత్తలు అవసరం

విజయనగరం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య సిబ్బంది, కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ప్రజారోగ్య సిబ్బంది, కార్యదర్శులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2002 ఓట్లతో 2025 ఓట్లు సరిపోల్చే విధానాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ పి.నల్లనయ్య బీఎల్‌ఓలకు ఆదేశించారు శుక్రవారం తన ఛాంబర్లో నగరంలోని బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఇదిలా ఉండగా.. నగరంలోని జనతా బజారు, మయూరి, ఎత్తుబ్రిడ్జి వద్ద ఉన్న దుకాణాలకు సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు వేలం పాట నిర్వహించారు.

సేంద్రియ సాగుకు సహకారం

చీపురుపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సేంద్రియ సాగుకు తమ శాఖ తరఫున సహకారం అందిస్తామని ఏవో సూర్యకుమారి అన్నారు. వెలుగు ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న వీఓఏలు, వీఓలు కార్యవర్గ సభ్యుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎస్.అప్పలనాయుడు, సీసీలు, ఏఓఏలు, వీఓల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి సూచికల్లో మెరుగుపడాలి: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి సూచికలు మెరుపడాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి సూచించారు. వివిధ శాఖల పనితీరుపై శుక్రవారం సాయంత్రం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలు గ్రోత్ రేట్‌ను పెంచి ముందు వరుసలో నిలవడమే లక్ష్యంగా పని చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల పెంపకంపై దృష్టి పెట్టాలి

స్థానిక మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయల పెంపకాన్ని చేపట్టాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి తెలిపారు. సీజనల్‌గా డిమాండ్ ఉన్న కూరగాయలు, ఆకు కూరలు తదితర పంటల విస్తీర్ణాన్ని పెంచడంపై ఉద్యాన అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఉద్యాన శాఖ డీడీ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

2017లో ఇచ్చిన హామీలను అమలు చేయండి



ఎస్.కోట: వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

కొత్తవలస, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర గ్రేహౌండ్స్ దళాల శిక్షణ కేంద్రానికి భూములు ఇవ్వడానికి మేం వ్యతిరేకం కాదు. కానీ 2017లో మాకు ఇచ్చిన హామీలను అమలు చేయండి' అని జోడుమెరక, తమ్మన్న మెరక గ్రామాల ప్రజలు అన్నారు. గతంలో గిరిజన యూనివర్సిటీ కోసం సేకరించిన సుమారు 526 ఎకరాల ప్రభుత్వ భూములను రాష్ట్ర గ్రేహౌండ్స్ దళాల శిక్షణ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి శుక్రవారం అప్పన్నదొరపాలెం గ్రామంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న గిరిజనులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. గిరిజన యూనివర్సిటీకి భూమి సేకరించిన సమయంలో 146 మందికి స్థలాలు మంజూరు చేసి..ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రైతులకు ప్రత్యామ్నాయంగా వేరే ప్రాంతంలో భూమి ఇస్తామని చెప్పారని తెలిపారు. యూనివర్సిటీలో ఉపాధి కల్పిస్తామని... గిరిజనులకు అక్కడే చదువుకోవడానికి సీట్లు ఇస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీలన్నిటినీ నెరవేర్చాలని కోరారు. ఈ గ్రామసభలో ఇన్‌చార్జి తహసీల్దార్ సునీ, ఆర్ఐ షణ్ముఖ పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులివ్వండి

శృంగవరపుకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును శాసన సభ్యురాలు కోళ్ల లలితకుమారి కోరారు. గురువారం రాత్రి అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రామప్రసాద్‌తో కలసి సీఎంను కలిశారు. వివిధ సమస్యలపై సీఎంకు వినతి పత్రం అందించారు. తుపాన్ సహాయ చర్యలు, ఇతర సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఎమ్మెల్యేను సీఎం అభినందించారు. నిత్యం నియోజకవర్గంలో తిరగాలని సూచించారని ఎమ్మెల్యే తెలిపారు.

ఆర్వోబీ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు

దత్తిరాజేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోమటిపల్లి రైల్వేగేటు వద్ద ఆర్వోబీ నిర్మాణానికి బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు బుధవారం రైల్వేశాఖ ఇంజనీర్లతో కలిసి స్థల పరిశీలన చేశారు. కోమటిపల్లి, గజపతినగరం రైల్వే లైను మధ్య ఉన్న ఎల్‌సీఆర్‌వీ 323ను పరిశీలించారు. ఆర్వోబీ నిర్మాణం నిమిత్తం స్థానికులతో చర్చించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూమిపై పూర్తి నివేదిక తయారు చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ హరికిరణ్, రైల్వే ఇంజనీర్ కేఎస్.రావు, ఆర్ఐ నారాయణరావు, సర్వేయర్ అప్పలస్వామి, టీడీపీ నాయకులు శీర రామారావు, పెంటమాని కేశవరావు, పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



కల్యాణిత

నెల్లిమర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల టేబుల్ టెన్నిస్ పోటీలకు మిమ్స్ హోమియోపతి కళాశాల రెండో సంవత్సరం విద్యార్థిని కల్యాణి ఎంపికైనట్టు ఫిజికల్ డైరెక్టర్ కె.కళావెంకటరావు శుక్రవారం తెలిపారు. ఏలూరులోని ఆశ్రం మెడికల్ కళాశాలలో ఇటీవల జరిగిన ఎంపిక పోటీల్లో ఈ విద్యార్థిని ప్రతిభ కనబరిచారని చెప్పారు. ఈ నెల 9 నుంచి నాలుగు రోజుల పాటు విశాఖపట్టణం గీతం యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరగనున్న సౌత్‌జోన్ పోటీల్లో కల్యాణి పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కల్యాణిని మిమ్స్ ఛైర్మన్ అల్లూరి సత్యనారాయణరాజు, మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ ప్రవీణ్‌వర్మ, కళాశాల డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్, మిమ్స్ డైరెక్టర్ డాక్టర్ వేణుగోపాలరావు తదితరులు అభినందించారు.

వినతుల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అదితిగజపతిరాజు

విజయనగరం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజ.ల వినతులను పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారిస్తానని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల ప్రజలు వివిధ సమస్యలపై ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకి వినతులు సమర్పించారు. రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలని, వీధి దీపాల సమస్యతో పాటు, ఇళ్లు, ఇంటి రుణాలు, రేషన్ కార్డులు, సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ మండల, నగర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజాంలో...

రాజాం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో 50కు పైగా వినతులు వచ్చాయని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. వీటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. తనకు అందిన వినతుల్లో అధికంగా రెవెన్యూ, వీధిలైట్లు తదితర సమస్యలు ఉన్నాయని తెలిపారు. సంబంధిత అధికారులకు వాటిని పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గురవాన నారాయణరావు పిన్నింటి మోహన్‌రావు, పెంకి గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా ఏర్పాట్ల పరిశీలన

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జీఎంఆర్ ఐటీలో జరుగనున్న జాబ్‌మేళా ఏర్పాట్లును ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం అక్కడి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఎల్.కోటలో ప్రజాదర్బార్

లక్కవరపుకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎల్.కోట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం మొదలవుతుందని... కార్యకర్తలు, ప్రజలు వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తెలియజేయాలని సూచించారు.

ఎన్జీవో అధ్యక్షుడిగా పైడన్న

గజపతినగరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో గజపతినగరం తాలూకా యూనిట్ నూతన అధ్యక్షుడిగా ఎం.పైడన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి జె.విక్టర్, సహాయ ఎన్నికల అధికారి ఎ.ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ప్రకటించారు. కార్యదర్శిగా ఎం.రమణతో పాటు 15మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పట్టణ అధ్యక్షులు వై.ఆనంద్‌కుమార్, యూనిట్ అధ్యక్షులు సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

రాజాం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణపు రానికి చెందిన పిడుగు సతీష్ ఇంటి పన్నులు రూ.2 లక్షల 36వేల 222ను కమిషనర్ ఎ.రామచంద్రరావుకు అందజేశారు. సతీష్‌ను ఆదర్శంగా తీసుకుని అన్ని వార్డులకు చెందిన వారు కూడా ఇంటి పన్నులు, కుళాయి పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

భోగాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతీ వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు చిన్నారావు మాట్లాడుతూ దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, స్థానిక సంస్థల్లో పోటీచేసే అవకాశం వంటి 7వరాలు ప్రకటించిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు బట్టా వెంకటరమణ, బమ్మిడి పాపారావు, ముకుంద పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పంచాయతీ పరిధిలోని గాంధీ పార్కు అభివృద్ధికి శుక్రవారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు భూమి పూజ చేశారు. దీని అభివృద్ధికి ముందుకు వచ్చిన సర్పంచ్ గనివాడ సంతోషి కుమారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, వైఎస్ ఎంపీపీ, టూరిజం డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి, ఎంపీటీసీ సభ్యురాలు మజ్జిదేవి పాల్గొన్నారు.

న్యాయం చేసే వరకు పోరాడుతాం

శృంగవరపుకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని జిందాల్ భూ నిర్వాసితులు తెల్చి చెప్పారు. శుక్రవారం బొడ్డవరలో జిందాల్ యాజమాన్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు. 175 రోజులుగా నిరసనలు చేపడుతున్నా... యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి



వివరాలను వెల్లడిస్తున్న న్యాయాధికారులు

రాజాం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాసంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ పిలుపు నిచ్చారు. ఇందుకోసం న్యాయవాదులు, బ్యాంకర్లు, పోలీస్, రెవెన్యూ, చిట్‌ఫండ్ యజమానులు సహకరించాలని ఆమె కోరారు. జూనియర్ న్యాయాధికారి కె.నైమిషతో కలిసి కోర్టు సముదాయ ప్రాంగణంలో పోలీసులు, న్యాయవాదులతో శుక్రవారం వేర్వేరుగా సమావేశమయ్యారు.

గుజరాత్ సదస్సులో నాగార్జున



స్టాళ్లను పరిశీలిస్తున్న నాగార్జున

చీపురుపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని గాంధీనగర్‌లో నాబార్డ్, ఐఎంఎఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల ఎర్త్ సమ్మిట్‌లో విజయనగరం డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున పాల్గొన్నారు. ఎంపవరింగ్ అగ్రికల్చర్, రూరల్ టెక్ అండ్ హ్యూమానిటీ అనే అంశంపై ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ సాంకేతికత, నూతన పరిష్కారాలపై నాగార్జున పలు సూచనలు చేశారు. సదస్సులో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు.

ఆక్రమణల తొలగింపునకు సిద్ధం



చెరువు గట్టుపై ఉన్న నిర్మాణాలు

భోగాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భోగాపురం గ్రామ సమీపంలో ఉన్న మూడు చెరువులపై ఉన్న ఆక్రమణలను తొలగించే దిశగా అధికార యంత్రాంగం అడుగులు వేస్తోంది. ఇందులోభాగంగా చెరువు గట్టుపై ఉన్న నిర్మాణాలు, షాపులు, దుకాణాలకు విద్యుత్తు మీటర్ల ఏర్పాటుకు గతంలో పంచాయతీ ఇచ్చిన ఎన్వోసీలను రద్దు చేస్తున్నామని కార్యదర్శి ఆర్.జయమ్మ శుక్రవారం విద్యుత్తు శాఖకు నోటీసులు జారీ చేశారు. ఈవిషయమై కార్యదర్శి జయమ్మ మాట్లాడుతూ ఆక్రమణలు తొలగించాలంటూ 64 మందికి నోటీసులు అందించామన్నారు. ఆక్రమణదారులు స్పందించకపోవడంతో విద్యుత్తు శాఖకు నోటీసులు జారీ చేశామన్నారు. దీనిపై ఏఈ మస్తాన్‌వలీని వివరణ కోరగా పంచాయతీ నోటీసుల మేరకు మీటర్లు తొలగిస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ రమణమ్మ మాట్లాడుతూ ఎంపీడీవో, ఇరిగేషన్ అధికారులతో కలసి పరిశీలించి..ఆక్రమణలను తొలగిస్తామని తెలిపారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సీతానగరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మరిపివలస సమీపంలో ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం శుక్రవారం పార్వతీపురం నుంచి విజయనగరం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు పార్వతీపురం వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయసు సుమారు 38 ఏళ్లు ఉంటాయని తెలిపారు. మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. దీనిపై ఏఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేశారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



అప్పలనాయుడు (ఫైల్)

గజపతినగరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పురిటిపెంట గ్రామ సమీపంలో విద్యుత్ వైర్లు తగిలి ఒకరు మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గంట్యాడ మండలం బుడతనాపల్లికి చెందిన కొర్నాన అప్పలనాయుడు(30) గురువారం రాత్రి పురిటిపెంట గ్రామం వద్ద ఇసుకను ట్రాక్టరులో లోడు చేయించాడు. అనంతరం ఇసుకను చదును చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య పైడిరాజు, ఇద్దరు పిల్లలు పవన్, ప్రియ ఉన్నారు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సులో విద్యార్థుల హల్‌చల్

గుర్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం నుంచి గరికివలస వెళ్లే ఆర్టీసీ బస్సులో ఆనందపురం గ్రామానికి చెందిన కొందరు విద్యార్థులు శుక్రవారం హల్‌చల్ చేశారు. ఉదయం గరికివలస నుంచి విజయనగరం బయలుదేరిన ఆర్టీసీ బస్సులో తలుపు వద్ద నిలబడి అసభ్యంగా మాట్లాడుతూ ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. బస్సుకు వెనుకభాగంలో ఉన తలుపును కూడా తీసి కిందపడేశారు. దీంతో డ్రైవర్, కండక్టర్లు నెల్లిమర్ల పోలీసు స్టేషన్ వద్ద బస్సు నిలుపుదల చేసి పోలీసులకు సమస్యను తెలిపారు. దీంతో అక్కడ విధుల్లో ఉన్న పోలీసు వారికి కౌన్సెలింగ్ చేసి పంపించారు.

సంఘాల అభివృద్ధికి ప్రణాళికలు



మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస్ పాణి

గజపతినగరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లలో స్వయం సహాయక సంఘాల అభివృద్ధితో పాటు గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ పాణి అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో విజన్ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల అభివృద్ధితో పాటు పారిశ్రామికంగా వారి కలలను నెరవేర్చుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం లక్ష్మునాయుడు, శ్రీనిధి ఏపీఎం చిట్టిబాబు, ఏపీఎం నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సంఘాలు బలోపేతం కావాలి

బొండపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలు బలోపేతం కావాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ పాణి పిలుపునిచ్చారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం స్వయం సహాయక సంఘాల వీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కె.పంటంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయండి

గరివిడి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇళ్ల మంజూరుకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులు అందరి దరఖాస్తులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హౌసింగ్ అధికారులకు సూచించారు. గరివిడి ఎంపీపీ మీసాల విజయలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వెదుళ్లవలసకు కార్యదర్శిని నియమించాలని జిల్లా పంచాయతీ అధికారికి ఆయన ఆదేశించారు. కోనూరులో జెడ్పీసీఈవో పర్యటించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. కొండపాలెం పంచాయతీలో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలకు రహదారి లేకపోవడం పట్ల సభ్యుడు యడ్ల సూర్యారావు అడిగిన ప్రశ్నకు ఛైర్మన్ స్పందిస్తూ తక్షణమే తహసీల్దార్, ఎంపీడీవో వెళ్లి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎంవీబీ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ చింత బంగార్రాజు, జెడ్పీటీసీ సభ్యులు వాకాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తాం

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై తాము నిరంతరం ప్రశ్నిస్తామని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ధర్మపురిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వైద్య కళాశాలలు ప్రభుత్వ ఆధీనంలో ఉండేటంతవరకూ తమ పోరాటం కొనసాగుతుందన్నారు ఈ సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు, నాయకులు కేవీ సూర్యనారాయణరాజు, జైహింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ-టార్చ్ పిన్‌టెక్ ఇండియా ఎంవోయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

విజయనగరం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం, టార్చ్ పిన్‌టెక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ (హైదరాబాద్) సంస్థల మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం కుదిరింది. జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ వివి సుబ్బారావు, జి.జయసుమ, టార్చ్ పిన్‌టెక్ ఎమ్‌డీ వైభవ్ సీపాన పరస్పరం అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా పరిశ్రమ ఆధారిత నైపుణ్యాలు, స్వయం ఉపాధి కోర్సులు తదితర వాటిపై శిక్షణ ఇవ్వనున్నారు.

అంతర పంటలతో లాభాలు

వేపాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు రబీలో పెసర, మినుములో అంతర పంటలు సాగు చేస్తే మంచిదని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అ న్నారు సోంపురం,ఓబలయ్యపాలెం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి ప్రకాష్, సీఎస్‌పి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సప్త వరాలపై సంబరాలు



సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సీఎం చంద్రబాబునాయుడు సప్తవరాలు అందించనుండటంతో బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబీ నాయన ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో పూర్తిగా ఉచిత ప్రయాణం తదితర ఏడు వరాలను సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారన్నారు. గత ప్రభుత్వంలో దివ్యాంగులు ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో దివ్యాంగులకు చంద్రోదయం వచ్చిందన్నారు. దివ్యాంగులపై సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. దివ్యాంగులను ఆర్థికంగా, సామాజికంగా,రాజకీయంగా ఉన్నతిలోకి తేవడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు త్రిచక్ర మెటార్ వాహనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి చీమల రాంబాబు పాల్గొన్నారు.

సందడిగా మెగా పేరెంట్, టీచర్ మీట్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు

బొబ్బిలి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్ మీట్ సందడిగా నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు విద్యార్థులు స్వాగతం పలికారు. ప్రధానోపాధ్యాయుడు బి.జగదీశ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు.. విద్యార్థుల ప్రగతి నివేదికలను తల్లిదండ్రులకు వివరించారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. పిల్లలకు బంగారు భవిష్యత్‌ను అందించగలిగే సత్తా వారికే ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేశామన్నారు. తల్లికి వందనం, మధ్యాహ్న భోజన పథకం, ఉచితపుస్తకాల పంపిణీ వంటి కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు రోజులో కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాలు చేశారు. ఎంఈవో గొట్టాపు వాసుదేవరావుతో పాటు వార్డు పెద్దలు పాల్గొన్నారు.

●బొబ్బిలి రూరల్ , డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 88 పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్ టీచర్ మీట్ నిర్వహించారు. దాదాపు 6వేల మంది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎస్ఎంసీ సభ్యులు, సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. రంగరాయపురం ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఎంపీడీవో రవికుమార్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి ఎంత ముఖ్యమో, తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా అంతే అవసరమన్నారు. పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమా ల్లో తల్లిదండ్రులు పాల్గొని పిల్లల చదువు, నడవడికపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యా యులతో మాట్లాడి విద్యార్థుల ప్రగతి అడిగి తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

(5వ పేజీ తరువాయి)

ప్రమాణాల స్థాయిని తెలుసుకునేందుకు చేపడుతున్న చర్యలను వివరించారు.

విద్యార్థుల నాలెడ్జ్ అద్భుతం

అనంతరం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యావిధానం ఎంతో మెరుగ్గా ఉంది. పరీక్షలు జరిగిన తరువాత సమర్థత తెలుసుకోవడం కాకుండా ఎప్పటికప్పుడు విద్యార్థుల చదువులను పరిశీలించేందుకు తీసుకుంటున్న చర్యలు ఎంతో బాగున్నాయి. మధ్యాహ్నం భోజనం నుంచి విద్యాకిట్ల వరకు నాణ్యత పెంచాం. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా పిల్లలకు సన్నబియ్యంతో భోజనం పెడుతున్నాం. విలువలతో కూడిన సమాజాన్ని ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఉన్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. షైనింగ్ స్టార్స్ పేరుతో ప్రతిభా అవార్డులు అందిస్తున్నాం. క్లస్టర్ అప్రోచ్ ద్వారా విద్యలో నాణ్యత ప్రమాణాలు పరిశీ లించేందుకు ప్రయత్నాలు చేపట్టాం.' అని తెలిపారు.

నెంబర్‌వన్‌గా ఉంచేందుకు కృషి

'దేశంలోనే ఏపీ విద్యా వ్యవస్థ నెంబర్‌వన్‌గా ఉంచేందుకు కృషిచేస్తున్నాం. పిల్లలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేసేందుకు స్టూడెంట్ ఇన్నోవేటర్స్ పార్టనర్‌షిప్ సమ్మిట్ నిర్వహించాలని నిర్ణయించాం. ఈ సదస్సుకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తాం. పిల్లల ఆలోచనలు బాగుంటే వారి ప్రతిభను గుర్తించి అన్ని విధాలుగా ప్రోత్సహిస్తాం. విదేశీ విద్యకోసం 'కలలకు రెక్కలు' పేరిట పథకాన్ని ప్రారంభిస్తాం. పావలా వడ్డీతో విదేశీ విద్యకు రుణాలు అందిస్తాం. జిల్లాలో చేపడుతున్న ముస్తాబు కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో అమలుచేయాలి.' ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. అనంతరం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డిని అభినందించారు.

తోటపల్లి, నదుల అనుసంధానంపై ప్రత్యేక దృష్టి

'జిల్లాలోని తోటపల్లి ప్రాజెక్ట్ ఎడమకాలువపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తాం. నాగవళి, వంశధార నదుల అనుసంధానం చేస్తాం. తాగు, సాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అనంతరం విద్యార్థినుల కరాటే ప్రదర్శనలను తిలకించి వారిని అభినందించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రసంగాలు..

ఆత్మీయ సమావేశంలో పలువురు విద్యార్థులు తమ ప్రసంగాలతో అందర్నీ ఆకట్టుకున్నారు. సామాజిక బాధ్యత, వ్యక్తిగత పరిశుభ్రత, కృతజ్ఞత, బాల్యవివాహాలు, స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర, డ్రైడే డ్రైడే, ముస్తాబు వంటి అంశాలపై మాట్లాడిన పాఠశాల విద్యార్థినులను సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ అభినందించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, కమిషనర్ విజయరామరాజు, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్‌కలెక్టర్లు వైశాలి, పవార్‌స్వప్నిల్ జగన్నాథ్, డీఈవో రాజ్‌కుమార్, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ రామారావు, ప్రిన్సిపాల్ బాబురావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి అడుగులు

(5వ పేజీ తరువాయి)

ఉంటేనే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుంది. దీనిపై ఏఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు కలిసి మహిళా సంఘ సభ్యులకు అవగాహన కల్పించనున్నారు. పలువురు పిల్లల గ్రామాల్లో పాఠశాలలకు వెళ్లడం లేదు. తల్లిదండ్రులు కూడా వీరిని చదివించకుండా వ్యవసాయ కూలి పనులు, ఇతర పనులను పంపుతున్నారు. ఇలాంటి వారికి చదువు విలువ తెలయచేయడంతోపాటు ఆర్థిక సాయం అందించే ఏర్పాట్లు చేయనున్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారి జాబితాను తయారు చేయనున్నారు. చదువు రాని మహిళలకు అక్షరాలు నేర్పనున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా కనీసం ఒక మండలంలో వెయ్యి ఎకరాల్లోనైనా సేంద్రియ సేద్యం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. ఔత్సాహిక రైతులను గుర్తించి వారికి రుణ సదుపాయం కల్పించనుంది. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్థక శాఖల సహకారంతో ఆధునిక పరికరాలు, నాణ్యమైన విత్తనాల సేకరణ జరిగేలా చూడనుంది. పించన్ల పంపిణీ మరింత పారదర్శకంగా జరిగేందుకు మహిళా సంఘాలు సహకారం అందించడంతో పాటు అర్హులందరికీ పింఛన్లు అందేలా చూడనున్నారు. కొంత మంది మహిళలకు తమకు తెలియకుండానే హింసకు గురవుతున్నారు. వివిధ కారణాలతో సమాజంలో తిరగలేక న్యూనతకు లోనవుతున్నారు. ఇలాంటి వారికి పోలీసు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, సెర్ప్ సహకారంతో అవగాహన కల్పించనున్నారు. పేదలకు సొంత ఇల్లు ఉండేలా చూడనున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ సహకారంతో సొంత వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమయ్యే చర్యలు చేపట్టనున్నారు. ప్రతి కుటుంబం నెలకు కనీసం రూ.20వేల ఆదాయం పొందేలా శిక్షణ ఇవ్వనున్నారు. 2026 ఏప్రిల్ నుంచి 2027 మార్చి నెలాఖరు వరకు వీటన్నిటినీ అమలు పరిచేందుకు అవసరమయ్యే బడ్జెట్‌ను సమీకరించేందుకు ఇప్పటి నుంచే ప్రభుత్వం ఈ శిక్షణలకు పూనుకుంది. స్వయం సహాయక సంఘాలు ఏ మేరకు సఫలీకృతమవుతాయో చూడాలి.

ఎలా ఉన్నారో?.. ఏం చేస్తున్నారో?

(5వ పేజీ తరువాయి)

సభ్యులను పరామర్శించారు. బంగ్లాలో చిక్కుకున్న మత్స్యకారులను సురక్షితంగా స్వగ్రామాలకు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆ తరువాత ఆ ఊసే మరిచిపోయారు. ఆరు వారాలు కావస్తున్నా కనీసం స్పందన లేకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. తమ వారి రాక కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి బంగ్లాదేశ్‌లో బందీలైన తమవారిని విడిపించాలని వేడుకుంటున్నారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి

(5వ పేజీ తరువాయి)

కళాశాలకు 6, డిగ్రీ కళాశాలకు 26 గదులను నిర్మించేందుకు ప్రణాళికలను రూపొందించినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా టీచింగ్, అండ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సర్వశిక్షా అభియాన్ ఏపీసీ రామారావు, ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, పీఏసీఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, మాజీ ఎంపీపీ, పార్టీ మండల అధ్యక్షుడు గంట్యా శ్రీదేవి, శీరం రెడ్డి రాంకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశరావు పట్నాయక్, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లోనే ఎంతో ప్రతిభ

(5వ పేజీ తరువాయి)

విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురంమన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాతో పాటు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గం నుంచి వచ్చిన దివ్యాంగుల కృత్రిమ అవయవాలను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామి, శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, దాసరి కార్పొరేషన్ చైర్మన్ పీవీ రత్నాజీ, టీడీపీ మండల అధ్యక్షుడు కోళ్ల వెంకటరమణ, విశాఖపట్నం డిప్యూటీ మేయర్ గోవిందరావు, ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత స్వరాభిషేకం

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం శివమణిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు, నగర డిప్యూటీ మేయర్ శ్రావణి, స్మారక కళాపీఠం గౌరవ అధ్యక్షుడు ఈఆర్ సోమయాజులు, కళాపీఠం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు దుర్వాసుల రాజేంద్రప్రసాద్, దవళ సర్వేశ్వరరావు, కార్యదర్శి ఉమాశంకర్, కోశాధికారి వైవీవీ సత్యనారాయణ (అబ్బులు), కార్యనిర్వహక అధ్యక్షులు బొత్స సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌వీఎల్ఎన్ గుప్తా, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

తెల్లారితే పెళ్లి.. అంతలోనే..

●యువకుడి ఆత్మహత్య

(5వ పేజీ తరువాయి)

చేస్తామని పెద్దలు చెప్పారు. అంత విరామం వద్దని, వెంటనే పెళ్లి చేయాలని ప్రియురాలు పట్టుబట్టింది. దీనిపై వారం రోజులుగా ఇరు కుటుంబాల్లో చర్చలు నడుస్తున్నాయి. ఇదే విషయమై ప్రియుడు, ప్రియురాలి మధ్య వివాదం కూడా నడిచింది. ఎంత చెప్పినా ప్రియురాలు వినకపోవడంతో ఇక చేసేదీ లేక శుక్రవారం ఉదయం సింహాచలం దేవస్థానానికి వెళ్లి అక్కడ దండలు మార్చుకొని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇంతలో ఏమైందో.. ఏమో గానీ ప్రియుడు గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటివద్దే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన విజయనగరంలోని దాసన్నపేట యాదవవీధిలో చోటుచేసుకుంది. కోరాడ శ్రీను, దేశాలు దంపతులకు కుమారుడు వీరేంద్ర (25), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరేంద్ర బీకాం పూర్తిచేసి ఓ కార్పొరేట్ సంస్థలో క్యాషియర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. తండ్రి శ్రీను అనారోగ్యం కారణంగా ఇంటివద్దే ఉంటున్నాడు. తల్లి దేశాలు కూలి పనులకు వెళ్తుంటుంది. వీరేంద్ర.. విజయనగరంలోని ఓ వీధికి చెందిన చిన్ననాటి స్నేహితురాలితో పెళ్లికి సిద్ధమయ్యాడు. మూఢం కారణంగా పెళ్లి ఆలస్యం కావడంతో ప్రియుడు, ప్రియురాలి మధ్య వివాదం చెలరేగింది. దీంతో వీరేంద్ర మనస్తాపానికి గురై, గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటిపై ఉన్న తన గదిలో ఫ్యాన్‌కి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున తండ్రి వెళ్లి చూసేపరికి కుమారుడు విగతజీవిగా పడి ఉండడంతో కన్నీరుమున్నీరయ్యాడు. వెంటనే తల్లి, చెల్లెళ్లు, చుట్టుపక్కల వారు చేరుకున్నారు. టూటౌన్ పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌ఐ కృష్ణమూర్తి, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

10 నుంచి టెట్

(5వ పేజీ తరువాయి)

అభ్యర్థులు 30 నిమిషాల ముందే కేంద్రాలకు చేరుకోవాలి. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. వీహెచ్, పీహెచ్ అభ్యర్థులకు 50 నిమిషాలు అదనంగా సమయం ఇవ్వడం జరుగుతుంది. పరీక్ష కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. ప్రతి కేంద్రానికీ ఒక డిప్యూటీ తహసీల్దార్, డిపార్టుమెంట్ అధికారి ఉంటారు. విద్యా శాఖ నుంచి ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు కానుంది. గత ఏడాది అక్టోబరులో నిర్వహించిన టెట్ పరీక్షను 22,889 మంది అభ్యర్థుల రాశారు.

నాడు అధ్వానం.. నేడు సౌకర్యవంతం



నాడు గోతులమయంగా..



నేడు సౌర్యవంతంగా అలజంగి-తెర్లాం రోడ్డు

బొబ్బిలి రూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): అలజంగి-తెర్లాం ప్రధాన రహదారి అధ్వానంగా ఉండేది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే అందరూ భయపడేవారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్లకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడమే ఇందుకు కారణం. ఇప్పుడు అందుకు భిన్నంగా పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రోడ్ల నిర్మాణాలను ప్రాధాన్యమిచ్చింది. 4.6 కి.మీ అలజంగి-తెర్లాం రోడ్డు నిర్మాణానికి రూ. 4.5 కోట్లను మంజూరు చేసింది. చురుగ్గా రోడ్డు పనులు సాగుతున్నాయి. నాటి గతుకుల రోడ్డు స్థానంలో సౌకర్యవంతమైన రోడ్డు దర్శనమిస్తోంది. దీంతో ఈ రోడ్డు మీదుగా ప్రయాణించే బొబ్బిలి, తెర్లాం, రాజాం, శ్రీకాకుళం ప్రాంతాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులలో పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని ఆర్అండ్‌బీ డీఈ వెంకటరావు తెలిపారు.

సమయపాలన పాటించాలి

బొబ్బిలి రూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో పి.రవికుమార్ అన్నారు. శుక్రవారం రంగరాయపురం, ఎం.బూర్జవలస సచివాలయాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ఉద్యోగుల హాజరు పట్టీ పరిశీలించి పలు సూచనలు చేశారు. పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై విస్తృత సర్వే

లక్కవరపుకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బెంబేలెత్తిస్తున్న స్క్రబ్ టైఫస్ వ్యాధిపై మండల స్థాయి అధికారులు విస్తృతంగా సర్వే నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఎంపీడీవో ఎస్.అప్పారావు కల్లేపల్లి, రేగ, లచ్చింపేట, పోతంపేట, చందులూరు, మార్లాపల్లి తదితర సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ కేసులు ఎక్కడైనా నమోదయ్యాయా అని ఆరా తీశారు. శానిటేషన్, జంగిల్ క్లియరెన్స్, ఫీవర్ సర్వే వంటి అంశాలపై తనిఖీలు నిర్వహించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎల్.కోట పీహెచ్‌సీ వైద్యులు బి.అనిల్‌కుమార్ సిబ్బందితో ప్రాథమిక సర్వే చేయిస్తున్నారు మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

●సంతకవిటి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.సుదర్శనరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సకాలంలో చికిత్స అందిస్తే ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. సాధారణ లక్షణాలు కనిపించినా అశ్రద్ధ చెయ్యకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

సుస్థిర సాగు విధానాలపై అవగాహన

నెల్లిమర్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సుస్థిర వ్యవసాయ విధానాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని గాజులరేగ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ వై.సంధ్యారాణి అన్నారు. ప్రపంచ మట్టి దినోత్సవం సందర్భంగా శుక్రవారం సెంచూరియన్ స్కూల్ ఆఫ్ స్మార్ట్ అగ్రికల్చర్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీన్ వేద, పుష్పలత, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి సహకారం

బొండపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):విద్యార్థుల అభివృద్ధికి సహకరిస్తానని గొట్లాం పీఏసీఎస్ మాజీ చైర్మన్ మహంతి రమణ పేర్కొన్నారు. గొట్లాంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తన సొంత నిధులు రూ.50వేలతో గ్రంథాలయం ఏర్పాటుకు అవసరమైన ర్యాంపుతో పాటు ల్యాబ్ పరికరాలు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీరామాచారి పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.50 వేల వితరణ

మెంటాడ,డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చింతాడవలస గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, విశ్రాంత ఉపాధ్యాయులు చింత రామునాయుడు స్థానిక పాఠశాల అభివృద్ధి కి రూ.50 వేలు విరాళంగా అందించారు. కుంటినవలస గ్రామానికి చెందిన మతల రామచంద్రరావు కుటుంబ సభ్యులు రూ.పదివేల విలువ చేసే ఫోన్, మతల రామునాయడు కంప్యూటర్‌ను అందించారు.

ఘనంగా కలశజ్యోతుల ఊరేగింపు

భోగాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బొల్లింకలపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి భవానీ దీక్షాధారులు కలశ జ్యోతులతో ఊరేగింపు నిర్వహించారు. తొలుత భవానీ పీఠం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

సంతకవిటి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులను బాధ్యులను చేయడమే కాకుండా యజమానిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తామని సీఐ ఉపేంద్ర తెలిపారు. శుక్రవారం సంతకవిటి పోలీసుస్టేషన్‌లో వినతులు స్వీకరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపాలరావుకు పలు సూచనలు చేశారు.

స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్‌పై మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్థానిక మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి సూచించారు. ఆమె శుక్రవారం మున్సిపల్ అధికారులతో స్క్రబ్ టైఫస్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి మైట్స్ అనే క్రిమి వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ వ్యాధి సోకినప్పుడు అధిక జ్వరం, తలనొప్పి రావడం, నొప్పులు తదితర లక్షణాలుంటాయన్నారు. ఈ క్రిమి పశువులను పెంచే చోట ఉంటుందన్నారు. పశువులు పెంచే వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, వార్డు శానిటేషన్ అండ్ హెల్త్ సెక్రటరీలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జ్వరాలపై సర్వే నిర్వహించాలన్నారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా నిరోధించాలన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటేషన్ ఎన్విరాన్మెంటల్ కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్యాటకశాఖ భూమిని ఎవరికీ ఇవ్వలేదు



సీపీఎం నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో

బొబ్బిలి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఐటీఐ సమీపంలోని సర్వే నెంబరు 223-2 లోగల 80 సెంట్ల పర్యాటక శాఖకు చెందిన భూమిని ప్రైవేట్ వ్యక్తులెవరికీ కేటాయించలేదని ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు తెలిపారు. ఐటీఐ సమీపంలోని భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారంటూ సీపీఎం నాయకుడు పి.శంకరరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆర్డీవో స్పందించారు. తహసీల్దార్‌ను విచారణకు ఆదేశించారు. ఆ స్థలం పర్యాటక శాఖ ఆధీనంలోనే ఉందని శుక్రవారం తన కార్యాలయంలో ఆర్డీవో.. సీపీఎం నాయకులకు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బొబ్బిలి రూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): కలవరాయి రైతు సేవాకేంద్రంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏవో మజ్జి శ్యామ్‌సుందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్ధతు ధరలు క్వింటాకు గ్రేడ్-ఎ రూ. 2389, కామన్ రకం రూ.2369 మదందతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రమ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌశలం పరీక్షల పర్యవేక్షణ

బొబ్బిలి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగాల కల్పనలో భాగంగా సచివాలయాల్లో నిర్వహిస్తున్న కౌశలం పరీక్షలను మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి శుక్రవారం పర్యవేక్షించారు. పట్టణంలోని కుమ్మరివీధి, పూల్‌బాగ్ ప్రాంతాల్లోని సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టీ, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. వాట్సాప్ గవర్నెన్స్, పురమిత్ర యాప్ డౌన్‌లోడ్ వంటి అంశాలపై సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. నాణ్యమైన పౌరసేవలను అందించాలని ఆదేశించారు. ఫోటో: 5బిబిఎల్‌పి 5,

ఎన్ఎంఎంఎస్ హాల్ టిక్కెట్ల పంపిణీ

బొబ్బిలి రూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): పెంట జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్ టీచర్ మీట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా జడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదన్నారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు దృష్టిసారించాలన్నారు. ఈ సందర్భంగా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో పాల్గొనే 25 మంది విద్యార్థులకు హాల్ టిక్కెట్లను హెచ్ఎం వేణుగోపాలరావు పంపిణీ చేశారు.

పునాదిలోనే నిలిచిన చెత్తసంపద కేంద్రం



బొబ్బిలి రూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): సీహెచ్.బొడ్డవలసలో చెత్తనుంచి సంపద తయా రీ కేంద్రం పునాది స్థాయిలోనే నిలిచింది. ఏడాదిన్నరగా పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. దాంతో గ్రామంలో సేకరించిన వ్యర్థాలు ఎక్కడికక్కడ పడేస్తున్నారు. దీంతో పారిశుధ్య సమస్య తలెత్తుతోంది. ● ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు వివరణ కోరగా.. చెత్త నుంచి సంపద కేంద్రం నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామ న్నారు.

సీహెచ్.బొడ్డవలసలో నిలిచిన నిర్మాణం

ప్రమాదాన్ని ఆహ్వానించేలా..



బొబ్బిలి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతకోర్టు జంక్షన్‌లో రోడ్డుపై ఏర్పడ్డ గుంత ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. మున్సిపల్ కుళాయి పైప్‌లైన్ లీకవడంతో ఇక్కడ పెద్ద గుంత ఏర్పడింది. ఈ జంక్షన్ మీదుగా అటు పార్వతీపురం వైపు, ఇటు పట్టణంలోని బలిజిపేట రోడ్డు వైపు రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ట్రాఫిక్ సిగ్నల్స్ కూడా అక్కడే ఉండటంతో పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. దాంతో అక్కడి గుంతను తప్పించే క్రమంలో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చాల్సిన అవసరం ఉంది.

ప్రమాదకరంగా ఉన్న గుంత